
# సామాజిక విధ్వంసమే!

- కాంగ్రెస్‌కు ఓటేస్తే డేంజర్ బెల్స్
- 3 గంటల కరెంటుతో సాగు ధ్వంసం
- ధరణి రద్దుతో పంచాయితీలు
- భూముల ధరలు అమాంతం పడిపోయే ప్రమాదం
- సాగు సాగక.. పనులు లేక.. రైతుల జేబులు ఖాళీ
- గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం
- గ్రామాల్లో ఉపాధి కరువై వలసలు పెరిగే ప్రమాదం

- ఒక రైతు జేబులో రూ.1000 ఉంటే.. పిల్లలకు మంచి బట్టలు కొంటడు. ఆ ఊర్ల ఉన్న బట్టల దుకాణం యజమానికి చేతిలోకి రూ.1000 వస్తాయి.
- ఒక రైతు జేబులో రూ.100 ఉంటే.. ఒక పూట ఇంటికి చికెన్ తీసుకుపోతడు. ఆ ఊర్ల ఉన్న చికెన్ దుకాణ యజమాని చేతిలోకి రూ.100 వస్తాయి.
- ఒక రైతు జేబులో రూ.10 ఉంటే.. ఊర్ల వీధి చివరన ఉండే హోటల్‌కు పోయి చాయ్ తాగు తాడు. ఆ చాయ్ బండి వ్యక్తి చేతి లోకి రూ.పది పోతాయి.



- మరి... అసలు రైతు జేబులో చిల్లిగవ్వ లేకుంటే? ఆ ఊర్ల బట్టల దుకాణం మాయమవుతుంది. చికెన్ దుకాణం మూతబడుతుంది. చాయ్ దుకాణం కంటికి కనిపించదు. అంటే రైతు సల్లగుంటే ఆ ఊరు సల్లగుంటది. గ్రామ ఆర్థిక వ్యవస్థ ఇలా ఒక చక్రంలా మారి పది మంది బతుకుతారు. వీటన్నింటికీ మించి భూముల ధరలు పెరగడంతో రైతు కుటుంబానికి ఇప్పుడు ఆర్థిక భరోసా ఉన్నది.

హైదరాబాద్/సిటీబ్యూరో ప్రధానప్రతినిధి, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం ఏర్పడక ముందు కరెంటు లేక.. సాగునీరు రాక.. భూములు పడావు పడ్డాయి. అందుకే ఒక్క రైతు జేబులో రూపాయి నిల్వ లేదు. ఆ ఊరికి ఆర్థిక భరోసా లేదు. పల్లెల్లో ఉపాధి లేక అటు రైతులు, ఇటు ఇతర వ్యాపారం చేసుకునేవారు వలసలు పోయేవారు. పిల్లలు, ముసలోళ్లు తప్ప ఊర్ల ఒక్క మనిషి కనిపించకపోయేది. పడావు పడిన భూములను చూసి తొండలు గుడ్లు కూడా పెట్టని భూములంటూ ఎకరానికి రూ.లక్ష ఇచ్చేందుకు కూడా ఎవరూ ముందుకు రాకపోయేది.

కానీ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతు బంధు వచ్చింది.. 24 గంటల కరెంటు వచ్చింది.. ప్రాజెక్టులతో సాగు నీళ్లు వచ్చాయి. భూగర్భజలాలు పెరిగి బోర్లు జోరుగ పోస్తున్నయ్. అందుకే రైతు ఏటా రెండు పంటలు పండిస్తున్నడు. నాలుగు రాళ్లు వెనకేసుకుంటున్నడు. వాటిని తన కుటుంబ అవసరాలకు ఖర్చు చేస్తుండటంతో గ్రామాల్లో ఇతర వ్యాపారాలూ కళకళలాడుతున్నాయి. మొత్తంగా గ్రామీణ గల్లాపెట్టె గలగలలాడుతున్నది. భూముల ధరలు పెరిగి గ్రామీణ ప్రాంతాల్లోనూ రియల్ రంగంలో జోష్ కనిపిస్తున్నది.

మరి కాంగ్రెస్ వస్తే.. కరెంటు 3 గంటలే ఇస్తానంటున్నది. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటున్నది. రైతు-కౌలుదారు మధ్య రైతు బంధు చిచ్చు రాజేస్తానంటున్నది. ధరణి రద్దుతో గ్రామాల్లో భూముల పంచాయితీలు తెస్తానంటున్నది. విధ్వంసం నుంచి వికాసం అనేది తెలివైన సమాజం చేసే పని. కానీ వికాసం నుంచి విధ్వంసానికి వెళ్లాలనుకోవడం?!

### మొండి గోడలతో తెలంగాణ పల్లెలు

'ఊర్లో ఏమున్నది.. ఆకలి చావులు తప్ప. పట్నానికి పోయి కూలినాలీ చేసుకుంటే ఒక పూట తిండయినా దొరుకుతుంది'.. ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లో ఇదీ పరిస్థితి. పూడిక పేరుకుపోయి తాంబాలాలుగా మారిన చెరువులు.. ఒట్టిపోయిన బోర్లు, బావులు.. కరెంటు కోతలు.. విత్తనాలు, ఎరువుల వెతలు.. ఆదుకునేవాడు లేక రైతులంతా చెట్టుకొకరు.. పుట్టకొకరుగా దేశాలు పట్టుకుని తిరిగేవారు. అర ఎకరం, ఎకరం సాగు చేద్దామన్నా నకిలీ విత్తనాలు, అర్ధరాత్రి కరెంటుతో పాము కాట్లు, కరెంటు షాక్‌లతో అర్ధంతరంగా తనువు చాలించిన అన్నదాతల సంఖ్య వేలల్లోనే ఉండేది. వ్యవసాయం సాగకపోవడంతో దాని అనుబంధంగా ఉండే కుల వృత్తుల రెక్కలు విరిగిపోయాయి.

ఊర్ల ఎవరూ లేకపోవడంతో ఇతర రంగాలూ కనుమరుగయ్యేవి. పిల్లలు, ముసలోళ్లను ఇంటి దగ్గర ఉంచితే... తమ వారు ఎప్పుడు వస్తారోనని మొండి గోడల మధ్య ఏండ్లకు ఏండ్లు ఎదురుచూపులు! అందుకే నాటి తెలంగాణ పల్లెలపై గోరటి వెంకన్న రాసిన 'పల్లె కన్నీరు పెడుతుందో' అన్న పాట ప్రతి హృదయాన్నీ కదిలించింది. ముఖ్యంగా 2005-06 నుంచి 2014 వరకు గమనిస్తే వ్యవసాయ రంగ వృద్ధిరేటు సగటున 4 శాతానికి మించలేదు. మూడేండ్లు ఏకంగా రుణాత్మక వృద్ధి నమోదైంది. దీంతో రైతులంతా నగరాల్లో వాచ్‌మెన్లుగా, ఆటో డ్రైవర్లుగా, అడ్డా కూలీలుగా దర్శనమిచ్చేవారు.

### రాసిందే రాత.. గీసిందే గీత

గ్రామాల్లో రైతులు ఎవరూ లేకపోవడం ఒక వంతైతే! రెవెన్యూ రికార్డులు అస్తవ్యస్తంగా ఉండటం మరోవంతు! ఇలా గ్రామాల్లో కాంగ్రెస్ నేతల ఒత్తిడితో రెవెన్యూ సిబ్బంది రాసిందే రాత, గీసిందే గీత. రాత్రికి రాత్రి రైతుల పేర్ల మీద ఉన్న భూములు రాజకీయ నాయకులు, ఆర్థికంగా ఉన్నవారి పేర్ల మీదకు మారేవి. తమ భూములు అన్యాక్రాంతమయ్యాయని రైతులు పోలీస్ స్టేషన్లకు వెళ్లినా రెవెన్యూ రికార్డులు ఎప్పుడో మారిపోవడంతో వారికి న్యాయం కూడా జరిగేది కాదు. ఇలా కాంగ్రెస్ నేతలు చేసిన సెటిల్‌మెంట్లతోనే రైతుల తలరాతలు మారేవి. ఈ క్రమంలో రైతుల మధ్య భూముల పంచాయితీలు.. గ్రామాల్లో అశాంతి నెలకొని ఉండేది.

## కాంగ్రెస్ వస్తే ఏమైతది?

- ధరణి రద్దయితది.
- 24 గంటలు పోయి 3 గంటల కరెంటు వస్తది
- అర్ధరాత్రి కరెంటుతో రైతులకు పాముకాట్లు, కరెంటు షాక్‌లకు గురి కావాల్సి వస్తది
- వ్యవసాయం చతికిలబడి భూములు పడావు
- రూ.40-50 లక్షలు ధర పలికే భూములు రూ.లక్ష లోపునకు పడిపోతాయి
- గ్రామాల్లో పట్వారీ వ్యవస్థ.. దళారుల రాజ్యం వచ్చి రైతుల భూమికి రక్షణ కరువు
- నిత్యం గ్రామాల్లో భూ పంచాయితీలతో పొలాల్లో ఉండే రైతులు ఠాణాల్లో గడపాలి
- రైతుబంధు, పంట కొనుగోళ్లు ఆగిపోయి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం.
- అన్నదాతల జేబుల్లో డబ్బు లు లేక.. వ్యవసాయం సాగదు, వ్యాపారాలు నడవవు
- పల్లెల చుట్టూ ఆర్థిక చక్రం పోయి పేదరిక వలయం ఏర్పడుతుంది.
- గ్రామాలు, పట్టణాల్లో పనుల్లేక... జనం వలసలతో మళ్లీ పట్టణాల బాట పడతారు.

### కూలీల కరువు.. సాగు యాంత్రీకరణ

తెలంగాణ ఏర్పడిన తర్వాత విప్లవాత్మక విజయం సాగు 24 గంటల కరెంటు. ఆపై సాగునీటి ప్రాజెక్టులు.. దీనికి తోడు మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వ వైభవం. రైతు బంధు, నిర్ణీత సమయంలో అందుబాటులోకి విత్తనాలు, ఎరువులు ఇలా ప్రభుత్వం రైతన్నను కంటికి రెప్పలా చూసుకోవడంతో వ్యవసాయ రంగం ఊహించని రీతిలో రికార్డులు నమోదు చేస్తున్నది. ధాన్యం ఉత్పత్తి స్థాయికి ఎదిగిందంటే రైతుల ఆర్థిక ముఖచిత్రం ఎలా మారిందో అర్థం చేసుకోవచ్చు.

### బలీయమైన ఆర్థిక చక్రంలో పల్లెలు

తెలంగాణ పల్లెల్లో సాగు గ్రామీణ ఆర్థిక ముఖచిత్రానికి కేంద్ర బిందువుగా మారింది. గుంట భూమిని సైతం వదలకుండా రైతులు సిరులు పండిస్తుండటంతో పల్లెలన్నీ ధాన్యపు రాశులుగా మారాయి. రైతును కంటికి రెప్పలా చూసుకుంటున్న తెలంగాణ ప్రభుత్వం చివరకు రైతు పండించిన పంటను సైతం గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు పెట్టి కొంటున్నది. వారం రోజుల్లోనే వారి ఖాతాలో డబ్బులు జమ చేస్తున్నది. తద్వారా రైతు కొనుగోలు శక్తి పెరిగింది. వ్యవసాయం బాగు పడటంతో దాని ఆధారంగా ఉండే కుల వృత్తులు సైతం పూర్వ వైభవాన్ని సంతరించుకున్నాయి. ఇలా గ్రామాల్లోనే అనేక రంగాలు బలోపేతమై, రైతు వెచ్చించే ప్రతి పైసా ఆ గ్రామం చుట్టూ ఒక ఆర్థిక వలయాన్ని ఏర్పాటు చేసుకొని సామాజిక భద్రతను ఏర్పాటు చేసింది. దీనికి తోడు తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన మరో విప్లవాత్మక సంస్కరణతో ఏర్పాటైన ధరణి ఇప్పుడు రైతుల భూములకు ఒక రక్షణ కవచంలా మారింది.

### వికాసం వదిలి విధ్వంసం వైపు వెళదామా?

ఆరు దశాబ్దాల విధ్వంసం తెలంగాణ రైతుల అనుభవంలోనే ఉన్నది. తొమ్మిదిన్నరేండ్ల బీఆర్‌ఎస్ హయాంలో పల్లె వికాసాన్ని కండ్లారా చూస్తున్నారు. మరి..కాంగ్రెస్ వస్తే ఇలా పల్లెల్లో అశాంతి రాజ్యమేలుతుంది.

**అందుకే విధ్వంసం నుంచి వికాసంలోకి వచ్చిన మనం... తిరిగి విధ్వంసంలోకి వెళదామా? వికాసంలో పురోగమిద్దామా? అనేది ఆలోచించుకోవాలి.**

# తేడా వస్తే భూముల ధరలు 50 ఏండ్లు ఎన్కకే!

**గత పదేండ్లలో ఇరవై రెట్లకుపైగా పెరిగిన విలువ**

ఎట్లుండే తెలంగాణ.. ఎట్లయ్యింది నేడు? రాష్ట్రం ఏర్పడక ముందు భూముల విలువ ఎట్లుండే? బీడు, పడావుపడ్డ భూములను ఎవరన్నా పట్టించుకున్నరా? వేలు, లక్ష లోపే ధరలుండేవి. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చినంక ఎంతో మార్పు. ఇప్పుడు పడావు, బీడు భూములు ఎక్కడన్నా కనపడుతున్నాయా? అసలు భూముల ధరల్లో ఎంత తేడా వచ్చింది. పదేండ్లలో ఇరవై రెట్లకు పైగా భూముల విలువ పెరగలేదా? ఆపత్కాలంలో మనల్ని ఆదుకుంటుందనే ధీమా భూమి యజమానుల్లో పెరగలేదా?

అందుకు ప్రధాన కారణం.. దండగ అనుకున్న సాగును పండుగలా మార్చేందుకు కేసీఆర్ చేపట్టిన పథకాలే. 24 గంటల కరెంటు, పుష్కలంగా సాగు నీరు, రైతు బంధు, రైతుబీమా.. ఇలా ఎన్నో చర్యలతో బీళ్లుగా ఉన్న భూములన్నీ సాగులోకి వచ్చాయి. భూముల విలువ పెరిగింది. దానితో పాటు ప్రజల్లో భరోసా పెరిగింది. ప్రజలు గుండెలపై చేతులేసుకుని నిశ్చింతగా నిద్రపోతున్న వేళ.. మళ్లీ మేమున్నామని కాంగ్రెస్ వాళ్లు వచ్చిన్రు. ఒక్క అవకాశమంటూ మభ్యపెడుతున్నరు. ఆదమరిచి వారికి ఓటు గనుక వేస్తే మన భూముల విలువంతా ఢాం అని పేలిపోతది. తస్మాత్ జాగ్రత్త.

### బీఆర్‌ఎస్ ప్రభుత్వ చర్యలతో భూములకు డిమాండ్

- కోటి ఎకరాలకుపైగా బీడు భూములు సాగులోకి
- ప్రతి పల్లెలో పండుగలా మారిన వ్యవసాయం
- కంపెనీల పెట్టుబడులతో భూముల ధరలు పైపైకి
- ఆదమరిస్తే, ఢామ్మని పేలనున్న భూముల విలువ
- రియల్ ఎస్టేట్ తన పేటెంట్‌గా చెప్పుకొన్న రేవంత్
- మన భూములు 'భూ'బకాసురులపరమే?!

ఊరుచివర మారుమూల ఉన్న ఎకరా భూమి కూడా ఇప్పుడు రూ.50 లక్షల ధర పలుకుతుంది కదా! రేపు, అదే భూమి రూ.50 వేల విలువ కూడా చేయకపోతే? ఏం జేస్తరు?? ఏంది గట్ల మాట్లాడుతరు అంటున్రా??

'ఒక్క చాన్స్' అంటూ ఉరికొస్తున్న కాంగ్రెస్ వాళ్లను నమ్మి ఓటేస్తే.. అదే జరుగుతది. మన భూముల విలువ ఢామ్మని పేలిపోతది. కాంగ్రెస్ పాలనలో మన భూముల విలువేందో ఓ సారి యాది జేస్కోండి! మీకే సమజైతది.

అంతేకాదు, ఎవుసానికి మూడు గంటల కరెంట్ చాలన్న రేవంత్.. ఇప్పుడు రియల్ ఎస్టేట్ తన పేటెంట్, తాను రియల్ ఎస్టేట్ వ్యాపారినని బాహాటంగానే ప్రకటించాడు.

అలాంటి కాంగ్రెస్‌కు ఆదమరిచి ఓటేశామా?? మన భూముల విలువ పడిపోతది. ఉన్న ఆ కొద్దిభూములు కూడా రాబందుల పాలైతయ్.

### ఏమైతది?

- 24 గంటల ఉచిత విద్యుత్తు 3 గంటలకు పడిపోతది
  - కాళేశ్వరంపై కండ్లమంటతో దాన్ని ఆగం పట్టిస్తరు
- తర్వాత నీటి ఎత్తిపోతలకు మంగళం పాడుతరు
  - కాలువలకు నీళ్లు రావు.. చెరువులు ఎండిపోతయ్
- భూగర్భ జలాలు పడిపోతయ్.. పొలానికి నీళ్లు ఆగిపోతయ్
  - రైతుబంధుకు రాంరాం చెప్పటంతో చేతుల పైసలుండయ్
- నీళ్లు, పెట్టుబడి సాయంలేక పచ్చని భూములు బీళ్లుగా మారుతయ్
  - ధరణిని తీసేయడంతో భూ రికార్డుల్లో పైరవీలదే రాజ్యం
- చేసేదేమీలేక భూముల్ని అమ్ముకొనే దుస్థితి దాపురిస్తది
  - అమ్ముకుందామంటే పడావు పడ్డ ఆ భూమికి రేటు రాదు
- ఇప్పుడు కోటి పలుకుతున్న ఎకరం భూమికి 2 లక్షలు దాటదు

హైదరాబాద్, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): వస్తువైనా, మరేదైనా.. డిమాండ్ ఉన్నప్పుడు సప్లై తగ్గిపోతే.. దాని ధర/విలువ పెరుగుతుంది. ఇది ఆర్థిక శాస్త్రంలో ఒక సూత్రం. ఇదే సూత్రం భూములకు కూడా వర్తిస్తుంది. భూమి ఎన్నటికైనా పెరగదు. ఎంతున్నదో అంతే ఉంటుంది. కానీ జనాభా మాత్రం ఏటికేడు పెరుగుతూనే ఉన్నది. ప్రజల కొనుగోలు శక్తి, భూములను ఉపయోగించే క్రమాన్ని అనుసరిస్తూ.. ఈ భూముల ధరలు పెరుగుతూ ఉంటాయి.

### రాష్ట్రం ఏర్పడకముందు రూ.లక్షలోపే

తెలంగాణ ఏర్పడక ముందు భూముల విలువ చాలా తక్కువగా ఉండేది. రూ. లక్షకు అటూ ఇటూగా ఎకరం భూమి దొరికేది. ఇక ఆదిలాబాద్ లాంటి జిల్లాల్లోనైతే రూ.వేలల్లోనే భూమి లభించేది. రాష్ట్రం ఏర్పడకముందు.. బీడు భూములు, పడావు పడ్డ భూములే అధికంగా ఉండేవి. వ్యవసాయం చాలా తక్కువ విస్తీర్ణంలో జరిగేది. వానకాలం, యాసంగి కలిపి కేవలం 1.20 కోట్ల ఎకరాల్లోనే అరకొర వ్యవసాయం సాగేది. వ్యవసాయానికి సరిపోయినంత విద్యుత్తు ఇవ్వకుండా.. 7 గంటల విద్యుత్తు అని చెబుతూ.. నాలుగైదు విడతల్లో ముక్కుతూ, మూలుగుతూ విద్యుత్తు సరఫరా చేసేవారు. పైగా రైతులకు ఎలాంటి పెట్టుబడి సాయం ఉండేది కాదు. అప్పులు తీసుకుని పంటలను సాగు చేసేవారు. ఇటు విద్యుత్తు లేక.. అటు సాగునీరు



అందక.. పంటల దిగుబడిరాక.. అప్పులు పెరిగి ఆత్మహత్యలు చేసుకున్న రైతన్నల దీనగాథలు ఎన్నెన్నో ఉన్నాయి. దీనితో రైతన్నలు వలస వెళ్లి కూలి పనులు చేసుకునేవారు. రాష్ట్రంలో మొత్తం బీడు భూములే కనపడేవి. పాలమూరు వలసల జిల్లాగా అందుకే పేరుగాంచింది. ఇలాంటి దయనీయమైన పరిస్థితులు నెలకొన్నందునే.. అప్పట్లో వ్యవసాయ భూముల ధరలు చాలా తక్కువగా ఉండేవి.

### సొంత రాష్ట్రంలో పండుగలా వ్యవసాయం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే.. అభివృద్ధికి మొదటి అడుగు వేసింది విద్యుత్తు విషయంలోనే. ముందుగా వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును పునరుద్ధరించారు. అటు తరువాత.. విద్యుత్తు వ్యవస్థలను బలోపేతం చేసి.. 2018 జనవరి ఒకటి నుంచి సాగుకు 24 గంటలు నిరంతరాయంగా పూర్తి ఉచిత విద్యుత్తును ఇస్తున్నారు. జలవనరులను పునరుద్ధరించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ లాంటి భారీ ప్రాజెక్టులను నిర్మించి రాష్ట్రవ్యాప్తంగా సాగునీటికి ఢోకా లేని పరిస్థితిని సృష్టించారు. అది వానకాలం అయినా.. యాసంగి అయినా.. పంటలకు పుష్కలంగా సాగునీరు అందుబాటులోకి రావడంతో.. బీడు భూములన్నీ సాగవ్వడం మొదలయ్యింది. వలస వెళ్లిన యజమానులు, రైతు కూలీలు తమ సొంతూళ్లకు తరలి వచ్చారు. రైతు సంక్షేమ పథకాలతో వ్యవసాయం బాగుపడటంతో ఇప్పుడు ఏకంగా బీహార్, మహారాష్ట్ర, ఒడిశా, యూపీ, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారంటే పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో అర్థం చేసుకోవచ్చు.

### పదేండ్లలో ఇరవై రెట్లు పెరిగిన భూముల ధరలు

సొంత రాష్ట్రం ఏర్పడకముందు ఉన్న దయనీయ పరిస్థితులన్నీ ప్రత్యేక రాష్ట్రంలో మారిపోయాయి. భూములకు డిమాండ్ పెరిగింది. కొనేవారు ఎక్కువయ్యారు. భూములను అమ్మేవారు తగ్గిపోయారు. డిమాండ్.. సప్లైల మధ్య తేడా తీవ్రమయ్యింది. దీంతో భూముల విలువ పెరిగింది. ఏదన్నా అత్యవసరం అయితే, కుటుంబ అవసరాలకు ఉన్నదాంట్లో ఎంతో కొంత భూమి అమ్మడం తప్పితే.. ఉన్న భూమంతా అమ్ముకోవడం అనేది లేదిప్పుడు. అందుకే భూముల విలువ మరింతగా పెరిగింది. గడిచిన పదేండ్లలో భూముల ధరలు సగటున ఇరవై రెట్లు పెరిగాయనే చెప్పవచ్చు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డిలాంటి నగరాలు, పట్టణాల్లో భూముల ధరలు అనూహ్యంగా పెరిగాయి. కంపెనీలు, పెట్టుబడులు వెల్లువలా రావడంతో రియల్‌ఎస్టేట్ గణనీయంగా పుంజుకున్నది.

### కాంగ్రెస్‌కు ఓటేస్తే ఖతమే

యాభై ఏండ్లలో కాంగ్రెస్ పార్టీ వ్యవసాయాన్ని దండగలా మార్చింది. మరోసారి అదే కాంగ్రెస్‌కు ఓటేస్తే ఇప్పటివరకూ సాధించిన అభివృద్ధి, సంక్షేమం అటకెక్కుతుంది. వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతింటుంది. భూముల విలువ మళ్లీ 'ఢాం'అని పేలుతుంది. వ్యవసాయ భూముల ధరలుకూడా తల్లకిందులవుతాయి. వాటి విలువ పడిపోతుంది. ఆపత్కాలంలో ఆదుకుంటాయని భావిస్తున్న మన వ్యవసాయ భూములు అతి తక్కువ ధరకే తెగనమ్మాల్సి వస్తుంది. రేవంత్ చేతుల్లో మన భూములు భద్రంగా ఉంటాయని అనుకోగలమా? కాంగ్రెస్‌కు ఓటేస్తే, భూములను అగ్గువసగ్గువకు తెగనమ్ముకోవడమో, లేక ఉచితార్థంగా కోల్పోవడమో జరుగొచ్చు. జర పైలం!!






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.